

విద్యుద్దీపపు స్తంభానికి చేరబడి కూచున్నాడు నారాయణ. చుట్టూ వెలుతురుంది. కాని, స్తంభం మొదట్లో మాత్రం చీకటి, చక్రంలా చుట్టివుంది. నారాయణ జీవితానికి అదే సరైన నిర్వచనం అని అనిపిస్తోంది.

నారాయణ దగ్గరికి ముడుచుకుని కూచున్నాడు. తరుచూ ఓ పెద్ద దగ్గుతెర వచ్చి, అతణ్ణి వూపిరి సలపనివ్వడం లేదు. అప్పుడప్పుడు, గుండెల్ని గట్టిగా అదుముకుంటున్నాడు.

ఆ వెల్తురులో అతని మొహం చూస్తే, యెంతో జాలివేస్తుంది. మాసినగడ్డం, సంస్కార విహీనమైన జుత్తు, లోతుకు పోయిన కళ్ళు, యెండి వాడిపోయిన పెదాలు — చాలా వికృతంగా కనిపిస్తున్నా, ఒకప్పుడు బాగా బ్రతికినవాడై వుంటాడన్న వూహ, అతణ్ణి చూసే వారికి కలగకపోదు. ఆ వూహను అంటుకునే అతనిపట్ల, జాలి, సానుభూతి జనించుతాయి. అప్పుడప్పుడు అతను 'ఖంగ్' 'ఖంగ్' మని దగ్గుతూవుంటే. అది విన్నవాళ్ళకే గుండెల్ని పట్టిలాగే బాధ కలుగుతుంది. ఆ బాధ శత్రువులకైనా వుండకూడదన్న సానుభూతి యేర్పడుతుంది.

అప్పుడే వచ్చాడు సత్యం. అతడు కాస్తంత వయసు మళ్ళినవాడే. పొట్టిగా, లావుగా వుంటాడు. ఏదోవిధంగా జీవించటం, బాగా నేర్చుకున్నవాడు. వస్తూనే

ముద్దంశెట్టి హనుమంతరావు

నారాయణ దగ్గుతుండటం, ఆ దగ్గుతోనే యెంతో ఆయాస పడుతుండటం గమనించాడు.

"నేను చెబితే వినవు నారాయణా! వెళ్ళి గవర్నమెంటు ఆసుపత్రిలో మందు తీసుకోకూడదూ! చూడు, యీ దగ్గు నిన్నెలా నిలదీసేస్తోందో: నా మాట విని రేపయినా వెళ్ళు" అన్నాడు చేతిలో వున్న డబ్బాని అక్కడ పెడుతూ.

నారాయణ నీరసంగా నవ్వేడు గాని, ఆ నవ్వు, సత్యం గమనించలేదు.

"ఇంక లాభంలేదు సత్యం...డాక్టరు దగ్గరికి వెళ్ళినా, నయమయ్యే జబ్బు కాదిది..." అంతలోనే దగ్గుతెర వచ్చే సరికి, యింక చెప్పలేక ఆగిపోయాడు.

సత్యం, సానుభూతితో అతడికేసి చూశాడు. "ఈ జబ్బుకి ప్రత్యేకంగా యేవో ఆసుపత్రులు వుంటాయటకదూ, అందులోనైనా చేరలేక పోయావా నారాయణా?" అన్నాడు.

నారాయణ ఓ నిట్టూర్పు విడిచాడు ఆ నిట్టూర్పులోనే అతని బాధ మూలుగుతున్నట్టుంది. సత్యం తన విషయంలో చాలా ఆసక్తి చూపిస్తుండటం వల్ల, తన జీవితచరిత్ర అతని కోసారి వినిపించాలని పించింది. తన మనసు విప్పి చెప్పాలని పించింది ఆ చెప్పడంలోనే కొంత వరకూ తన బాధను మర్చిపోగలడేమో నని భావించాడు.

"సత్యం ... నా చరిత్ర వింటే, నా బ్రతుకును నేనే యీ స్థితికి తెచ్చుకున్నాననీ, నువ్వు తప్పకుండా నే అంటావు... కాని, యేం చెయ్యను? పరిస్థితులు నన్ను అలా మార్చాయి..." అంటూ క్షణం ఆగి మళ్ళీ ప్రారంభించాడు. "నేను చదువుకుంటున్న రోజుల్లోనే అమ్మా, నాన్నలను కోల్పోయాను. అప్పట్నుంచీ, అన్నయ్య, వదినల దగ్గరే పెరిగాను. అన్నయ్య నన్ను యెంతో ప్రేమతో చూసేవాడు ... తండ్రి లేని లోటు నాకు కనిపించేది కాదు. మా వదిన కూడా నన్ను వాత్సల్యంతోనే చూసేది. నా చదువు పూర్తయి, వుద్యోగంలో చేరాను. అప్పుడే, నాకు యీ దగ్గు ప్రారంభమయ్యింది. రెండుమూడుసార్లు నోటి నుండి కాస్తంత రక్తం కూడా పడింది నేను ఆ విషయాన్ని యెవరితోను చెప్పలేదు. ఎందుకో నాలో ఓ విధమైన భయం స్థావరం యేర్పర్చుకున్నది. అది నా బలహీనతకు ప్రతిబింబమేమో మరి! అదే నేను చేసిన మొట్ట మొదటి పొరపాటు. నాకు పెళ్ళిచేసెయ్యాలని అన్నయ్య, వదిన ప్రయత్నాలు ప్రారంభించారు. నా ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని, అంతరాయం చెప్పాను. నా పట్టుదల చూసి, అర్థంగాక, అన్నయ్య కారణం అడిగాడు. అప్పుడు నిజం చెప్పలేదు. పెళ్ళంటే నాలో కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలు వున్నాయనీ, నాకు మనసు పుట్టినపుడే తనకి తానుగా చెప్తా

నని అన్నయ్యను సమాధాన పర్చాను. అన్నయ్య, మరి నన్ను బలవంత పర్చ లేదు. క్రమంగా, నాలో యీ రోగం ప్రజ్వరిల్లింది. రాత్రులు నిద్రపట్టేదికాదు. అందుకు తోడు నా మనోవ్యధ. మరింత కలత పర్చేది. ఒకటి రెండు సార్లు, అన్నయ్య డాక్టరు దగ్గరికి వెళ్ళమని ప్రోద్బల పర్చాడు. కొంతడబ్బు అందించాడు. వెళ్ళడం యిష్టం లేక పోయినా, మనసుకి వ్యతిరేకంగా ధైర్యం కూడ గట్టుకుని డాక్టరు దగ్గరికి ఓ రోజు వెళ్ళాను. డాక్టరు నన్ను పరీక్ష చేసి, పెదవి విరిచాడు. 'చదువుకున్న వాడివి అయివుండి కూడా, నువ్వు యింత అశ్రద్ధ చెయ్యడం బాగులేదబ్బాయ్' అని మెల్లగా మందలించి, మందులు రాసిచ్చాడు. డాక్టరు నాలో కలిగించిన నిరాశాభావం నన్ను మరింత కృంగదీసింది. జీవితంమీద విరక్తి పెరిగింది. జీవించాలన్న ఆశ క్రమంగా నశింప సాగింది. మరునటిరోజు అన్నయ్య అడిగాడు డాక్టరేమన్నా డని; ఏం చెప్పను? డాక్టరు పెదవి విరిచిన విధం, మందలించిన వైనం చెప్పడం నాకు యిష్టం లేక పోయింది. చెబితే, అన్నయ్య యెంతగానో కలవరపడతా డని నాకు తెలుసు 'పరవాలే దన్నా డన్నయ్యా' అని మరో సారి అబద్ధం చెప్పేశాను. ఇప్పుడు అబద్ధం చెప్పడానికి మునుపటిలా నాకేమీ ప్రయత్నం అవసరం లేకపోతోంది, మందులు కొన్నా ననికూడా చెప్పాను. నా మాటలు విశ్వసించకుండా యెప్పుడూ వుండలేదు అన్నయ్య. ఈ రోజు నేను అబద్ధం చెప్తున్నా నని యెలా అనుకోగలడు మరి! మందులుకోసం తనిచ్చిన డబ్బు నా పెట్లో భద్రంగా వుందని యెలా వూహిస్తాడు? నేను చెప్పింది నమ్మేశాడు.

"ఇక ఆఫీసు వాతావరణం, నన్ను బాగా కలచివేసి, గాయాన్ని కెలికింది. ప్రతి వ్యక్తీ నాకు దూరంగా వుండా లనే ప్రయత్నించడం, నాకు ఏడుపు తెప్పించింది. ఇంతకుముందు నాతో యెంతో సన్నిహితంగా తిరిగే వాళ్ళు కూడా యిప్పుడు యేదో సాకుతో తప్పుకు తిరుగుతున్నారు. ఇవన్నీ నా గుండెలకు గ్రుచ్చుకున్న సూదులై బాధించాయి. ఓ రోజు మా యింట్లో యేమయ్యిందో తెలుసా? ఆ సంఘటన స్ఫురణకు వస్తేనే నాకు బాధనిపిస్తుంది యిప్పటికీ. మా అన్నయ్య రెండో అబ్బాయి, నాదగ్గర కూచుని ఆడుకొంటున్నాడు. వాడికి నేనంటే యెందుకో ఆ అభిమానం. నన్ను చూడగానే, 'బాబాయ్. బాబాయ్' ముద్దుగా అంటూ దగ్గిరికి వచ్చేస్తాడు, నా రోగం సంగతి తెలిశాక, వాడికి దూరంగా వుండా లనే నేనూ అనుకుందేవాణ్ణి కాని, వాడు దగ్గరికి వస్తుంటే, వాణ్ణి పొమ్మన లేక పోయాను. కాస్సేపటికి ఓ ఉగ్రుతెర తుపానులా వచ్చింది వాడి ఆ అమా

యక దృక్కులు నా వేపు ప్రసరిస్తూ గమ్మున కూర్చున్నాడు. ఇంతలో మా వదిన చరచరా వచ్చి అబ్బాయిని తీసుకుని పోయింది. ఆమె మొహం చూశ్లేదుగాని. ఆ మొహంలో అసహ్యత నిండి వుంటుం దని వూహించుకొన్నాను. ఏ అభిప్రాయమూ లేకపోతే, అంత తొందరగా వాణ్ణితీసుకుపోదు. ఆఫీసులోని పరిస్థితే యింట్లోకూడా తటస్థపడింది... నా హృదయాంతరాళంలో వుత్పన్నమైన సంక్షోభం, నువ్వే వూహించుకో సత్యం. నా కళ్ళల్లో అశ్రువులు సుడులుతిరిగి, ధారా వాహినిగా చెక్కిళ్ళమీదకు జారాయి. ఆ క్షణంలో నామీద నాకే అసహ్యం పుట్టింది. నా జీవితం నిరర్ధకమనిపించింది. ఈ వ్యాధి యింత భయంకరమైన దని నాకు తెలీదు...ఇందులో నా అశ్రద్ధ కూడా లేకపోలేదు. అది నిరాశతో కూడిన అశ్రద్ధేనని యిప్పు డనిపిస్తుంది. ఎక్కడికి వెళ్ళినా యీ వ్యాధి నయమవ్వడం అసంభవం అనిపించింది. ఇన్నీ అయితే, యీ పరిణామా లన్నీ అన్నయ్యకు తెలీవు ప్రతిదినం నా ఆరోగ్యం విషయం అడిగేవాడు. ఆనాడు అంటే మా వదిన యీలా ప్రవర్తించిన రోజు అన్నయ్య యింట్లో లేకపోవడం నా అదృష్టమే అయ్యింది. లేకపోతే ఆ కుటుంబంలో కలతలు యేర్పడేవి. రక్త సంబంధం, విడివడని బంధం...నా గురించి అన్నయ్య తప్పక బాధపడి, వదిన ప్రవర్తనని గర్హించేవాడు. అప్పుడే మనస్పర్ధలు వారిద్దరిలో వుత్పన్నమయ్యేవి. ఇంతవరకూ హాయిగా, ఆదర్శవంతంగా సంసారం సాగిస్తున్న ఆ దంపతుల మధ్య, యేమాత్రం అగాథం యేర్పడినా నేను సహించలేను అదీ, నామూలంగా రావడం — అంతకంటే నా మనస్సుని నొప్పించేది మరొకటి వుండదు.

"ఆనాటి రాత్రి అన్నయ్య నా దగ్గిరకి వచ్చాడు. అతని మొహం మాడివుంది వదినకీ అతనికీ యేదో ఘర్షణ జరిగి వుంటుందేమో నన్న అనుమానం నా మనసులో యెక్కడో ఓమూల మెదిలింది. నాకేసి పరీక్షగా చూస్తూన్న అన్నయ్య మొహంలోకి చూడలేక పోయాను.

"తమ్ముడూ, నీ ఆరోగ్యం విషయంలో నువ్వు యేమీ పట్టించుకోవడం లేమురా! నిజంచెప్పు. మందులు తీసుకుంటున్నావా! అసలు, యింతకీ డాక్టరు యేమన్నాడు?" ప్రశ్నల వర్షం కురిపించాడు. ఆ ప్రశ్నలకు నేను క్షణం కలవరపడ్డాను. ఏంచెప్పడం నిజం చెబితే, తను యిన్నాళ్ళూ అబద్ధాలు చెప్తూవున్నందుకు అన్నయ్య తనని అసహ్యించుకుంటాడు. అబద్ధం చెప్పక తప్పిందికాదు.

"మందులు తీసుకుంటున్నా నన్నయ్యా! డాక్టరు కూడా పరవాలే



దంటున్నాడు... నీకు యీ అనుమానాలు ఎందుకు కలిగాయో బోధపడటం లేదు" అన్నాను...అది నా నిరాశతో కూడిన దబాయింపు ఒక అబద్ధం కప్పుకొందుకు యెన్నయినా అబద్ధాలు ఆడాల్సి వస్తుం దన్న లోకోక్తి నా విషయంలో అక్షరాలా సరిపోయింది.

అన్నయ్య క్షణం సేపు ఆలోచించాడు.

"సరే _ రేపు నిన్ను నాకు తెలిసిన డాక్టరు దగ్గిరికి తీసుకు వెళ్తానురా! ఆఫీసుకి శలవుపెట్టు..." అంటూ నా గదినుండి భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

"అన్నయ్య వెళ్ళిపోతున్న వేపే చూస్తూ, అలా శిలాప్రతిమలా వుండిపోయాను. రానున్న తుపాను యెలాంటిదో నాకు తెలుసు సత్యం...అన్నయ్య నా నిజస్థితి తెలుసుకుంటే. యేడవకుండా వుండలేడు. నన్ను తప్పకుండా యే

శావిటోరియానికో పంపుతాడు....నా వినాశనాన్ని చూడలేడు. ఆ రాత్రంతా నేను యెంత బాధపడ్డానో నాకే తెలుసును. పరిస్థితు లన్నీ నాకు ప్రతికూలంగానే కనిపించాయి. నే నింక యెవరికోసం జీవించడమో, నాకు బోధపడ్డంలేదు. నాకోసం, జీవిస్తా నన్న ఆశలేని నాకోసం, అన్నయ్యా తన సుఖాన్ని కూడా బలి పెట్టడం నాకు యిష్టం లేకపోయింది. మనిషి తన సుఖంకోసమే తాపత్రయ పడాలిగాని, తన సుఖంకోసం యితరుల సుఖాన్ని హరించడం అన్యాయ మని, నా తత్వం...అందరికీ దూరమైపోవా లని పించింది. నేను యెలాగూ జీవించను. నాకు సుఖం యెలాగూ లేదు....ఎదుటి వాళ్ళనైనా సుఖంగా వుంచాలని నా అభిమతం...

"రాత్రి పన్నెండు గంటలు కొట్టింది గడియారం. పెట్లోని రెండుజతల బట్టలు తీసి సంచిలో పెట్టాను. అన్నయ్యా నాకు మందులకని అప్పుడప్పుడూ యిచ్చిన డబ్బు తీసి, జేబులో పెట్టుకున్నాను. టేబిలుదగ్గిరికి పోయి. అన్నయ్యాకి ఓ పుత్తరం రాయడం ప్రారంభించాను... నా చేతులు వణికాయి. వుత్తరంలో యేం రాశానో తెలుసా సత్యం! నేను 'ఆత్మ హత్య' చేసుకోబోతున్నా ననీ, ఆ వుత్తరం యెవరైనా చూసేసరికి పర లోకంలో వుంటా ననీ రాశాను. ఇలా యెందుకు రాశా నని నువ్వు అడగవచ్చు ఆత్మహత్య చేసుకునే ధైర్యం నాలోలేదు. ఆ ధైర్యం, ఆ మొండితనం, అందరి లోనూ వుండవు .... అవి లేని వాళ్ళలో నే నొకణ్ణి. అలా రాసేస్తే, నాకోసం అన్నయ్యా వెదక్కుండా, ఓ యేడుపు యేడ్చి వూరుకుంటా డని నా అభిప్రాయం. జీవితమంతా బాధపడ్డం కంటే, ఒక్క యేడుపు మంచిదికదూ!...మెల్లగా బైటికి నడిచాను. ఆ నిశ్శబ్ద వాతావరణంలో, ఆ నిశీధిలో నేనొక్కణ్ణే వీధిలో వున్నాను... అడుగులో అడుగు వేసుకుంటూ పదిగజాల దూరం నడిచాను. ఒక్కసారి వెనక్కితిరిగి యింటి కేసి చూశాను. నా కళ్ళనుండి బొటబొట కన్నీళ్ళు జారుతూ క్రిందపడుతున్నాయి. అంతే! చరచరా ముందుకు సాగి పోయాను. ఆ రాత్రి బండిలో అయిదు వందల మైళ్ళకు పైన దూరంగావున్న యీ వూరు వచ్చేశాను..." యింత సేపు ఆపుకోడానికి ప్రయత్నించిన దగ్గుతెరని ఆపుకోలేకపోయాడు. రెండు నిముషాల పాటు నిలిపివేసింది.

సత్యం, అంతా విన్నాక, చెమ్మగిలిన కళ్ళను ఒత్తుకున్నాడు. నారాయణగాథ, కన్నీటిగాథ. అవకాశాలు వుంకికూడా, అధోగతి పాలయ్యాడు పాపం! తన మూలంగా యితరులు సుఖాన్ని బలి పెట్టుకోకూడ దన్న వుదాత్త భావంతో, తన జీవితాన్నే బలి చేసుకున్న త్యాగ మూర్తి నారాయణ.

దగ్గుతెర అంత మయ్యాక మళ్ళీ అన్నాడు నారాయణ "ఇదీ నా కథ సత్యం ! యిప్పుడు నన్ను డాక్టరు దగ్గరికి వెళ్ళమంటున్నావా?...యింకెందుకు చెప్పు... రోజులు లెక్కబెడుతున్న జీవితం నాది.." అన్నాడు నిస్పృహతో.

"అలా అనకూడదు నారాయణా ! ధైర్యంగా వుండాలి... ధైర్యమే సగం బలాన్ని చేకూరుస్తుంది..."

"ధైర్యం ! ధైర్యం–యింకెక్కడిది సత్యం ; నడిసముద్రంలో తుఫాను పాలబడి మునిగిపోతున్న పడవ చూస్తూ కూడా, యింక యెవరో దాన్ని రక్షిస్తారని అనుకోవడం, వట్టి భ్రమ... భ్రమే కాదు...తెలివితక్కువతనం కూడాను "

"అంత నిరాశ పనికిరాదు నారాయణా! అదిసరేగాని, నీకు మీ అన్నయ్యావాళ్ళను చూడా లనిపించడం లేదూ ?"

నారాయణ బాధగా నవ్వేడు.

"అసలు, ఆ బంధాలనుండి విముక్తి అయ్యాను కదా సత్యం. మళ్ళీ ఆ మమతల్ని పెంచుకుంటే, వారికి కష్టం కలిగించినవాణ్ణే అవుతానుగాని, వారికి ఆనందాన్ని కలిగించలేను...అందుకే, ఆ ఆలోచనల్ని అరికట్టుకున్నాను..."అన్నాడు.

సత్యం, ఒక్క నిట్టూర్పు విడిచాడు. "చదువుకున్న వాడివిగాబట్టి, నీ మెదడు నిండా ఆలోచనలే ! ప్రతీదీ ఆలోచిస్తావుగాబట్టే, ప్రతిచోటా ఓటమిని కౌగలించుకొంటున్నావు నారాయణా ! సరేలే... యీఅన్నం తిందాంరా ; తినేసి షెడ్డులోకి పోయి పడుందాం.." అన్నాడు.

"నే నిప్పు డేమీ తినను సత్యం, నాకు ఆకలిగా లేదు. రెండుసార్లు దాహంవేస్తే, పైపునీరు త్రాగివచ్చాను ... అందుకే నే నేమీ తినలేను."

సత్యంకి నారాయణపట్ల, అంతులేని సానుభూతి జనించింది. ఆ సానుభూతితో పాటు, అతనిపట్ల గౌరవభావం కూడా కలిగింది. ఆ బాధలో సమంగా తినలేక పోయాడు కూడాను. భోజన మయ్యాక, లేచాడు సత్యం.. ఇద్దరూ కాస్తంత దూరంలో కనిపిస్తున్న షెడ్డులోకి పోయి, పక్కపరుచుకుని చేరబడ్డారు. నారాయణకి, యెందుకో చలిగాలి జివ్వు మనిపిస్తోంది. అయినా, అక్కడే వుండక తప్పదు. నారాయణ వణికిపోతున్నాడు. అభిమానంకొద్దీ తన అవస్థను యెవరితోనూ చెప్పుకోలేదు.

చలిగాలి వల్ల ఆ రోజు దగ్గు మరీ విపరీతంగా తెరలు తెరలుగా వచ్చింది నారాయణకి. ప్రతీసారి గుండెలు ఆగిపోయినంతగా బాధపడేవాడు. మృత్యువు తనని ఆహ్వానిస్తున్నట్టుగా అనిపించిందతనికి. అతని దగ్గుమూలంగా, కొందరికి నిద్రాభంగం కలిగి విసుక్కొనేవారు. ఆ విసుగులు శాపనార్థాల్లా వినిపించేవి. మరింత కుమిలిపోయాడు... దగ్గును ఆపుకోడానికి అతను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యేవి. సత్యం నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

రాత్రి పన్నెండు దాటింది. అంతా నిశ్శబ్దంగా పడున్నారు. దగ్గు వచ్చినప్పుడంతా నోట్లో గుడ్డ వుంచుకునేవాడు శబ్దం రాకుండా. వాళ్ళందరి మధ్యా వుండటం కూడా ఆ రోజు మనస్కరించలేదు నారాయణకి. కాని, యెక్కడికి పోవడం ? సత్యంని వదిలి యెక్కడికి

పోవడం? తనకి అప్పుడిలా సుస్నేహితుడిలా వున్నవాడు అతడొక్కడే! యే జన్మ అనుబంధమో అది. అటువంటి సత్యంని వదిలి యెలా పోవడం?... యీ ఆలోచన సాగుతున్నంతలో దగ్గుతెర వచ్చింది. ఈసారి యేకబిగిని మూడునాలుగు నిమిషాలుదగ్గుతో చుట్టుకుపోయాడు. ఆఖరున అతని నోటినుండి రక్తం పడింది. గుండెల్లో యేదో జివ్వుమన్నట్టయ్యింది... అంతే: ఒక్కసారి వెనక్కి వాలిపోయాడు. దూరంలో వెలుగుతున్న విద్యుద్దీపం తప్పున ఆరిపోయింది. అంతవరకూ ఆ పరిసరాల్లో వున్న వెలుతురు అంతరించింది.

తెల్లవారింది. ఎవరిమట్టుకువారు లేచి, పోతున్నారు. సత్యంలేచాడు. నారాయణ అంతవేళవరకూ నిద్రపోవడం, అతడు యెప్పుడూ చూడలేదు. తెల్లవారుఝామున నిద్ర పట్టిందనుకున్నాడు.

"నారాయణా! లే. యిక...తెల్లవారింది..." అన్నాడు రెండుసార్లు.

నారాయణ కదలేదు....జవాబులేదు. సత్యం అతణ్ణి తట్టిలేపాడు. ఏముందిక? అతని శరీరం మంచుగడ్డలా తగిలింది.. సత్యం స్తంభించిపోయాడు. అతని కళ్ళు నీటిపర్యంత మయ్యాయి.

"నారాయణా! నన్ను వదిలిపోయావా?" అంటూ బావురుమన్నాడు, తమ్ముడు పోయినట్టుగానే బాధపడుతూ. అతని రోదన నారాయణ వింటాడా యేమి? సత్యం కళ్ళనుండి అశ్రువులు బొటబొటా చెక్కిళ్ళమీదికి జారిపోతున్నాయి.

